18న జిల్లాకు గవర్నర్ రాక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో ఈ నెల 18న గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పర్యటించనున్నారని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. గవర్నర్ జిల్లా పర్యటనను పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జాతీయ ఆయుర్వేదిక్ పర్వ్ వేడుకల్లో ఆయన పాల్గొంటారన్నారు. నవంబర్ 18 ఉదయం 10.45 గంటలకు గవర్నర్ హెలీకాప్టర్‌లో ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌కు చేరుకుంటారన్నారు. మంజీరలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన విడిదికి చేరుకుని, స్వల్ప విశ్రాంతి అనంతరం 11.30కి ఆనం కళా కేంద్రానికి చేరుకుంటారని తెలిపారు. జాతీయ ఆయుర్వేదిక్ పర్వ్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

ఐసిడిఎస్ నిర్వీర్యాన్ని సహించబోము

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయాలని చూస్తే సహించేది లేదని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభ బుధవారం స్థానిక విక్రమ్ హాల్లో అన్నపూర్ణ, మార్త అధ్యక్షతన జరిగింది. మూడేళ్ల యూనియన్ కార్యకలాపాల నివేదికను జిల్లా కార్యదర్శి చంద్రావతి, జిల్లా సహాయ కార్యదర్శి కె.బేబిరాణి ప్రవేశపెట్టారు. దీన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. తొలుత సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ఎస్.మూర్తి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ మహాసభలో బేబిరాణి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేస్తే సహించేది లేదన్నారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రాజకీయ, అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంపులో అంగన్‌వాడీల పాత్ర కీలకమన్నారు. అలాంటి ఐసిడిఎస్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నాయన్నారు. నూతన విద్యా విధానం పేరుతో అంగన్‌వాడీ సెంటర్లను పాఠశాలల్లో విలీనం చేసే లబ్ధిదారులను తగ్గించి, సెంటర్లు మూసేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. పక్కరాష్ట్రాలకంటే ఎక్కువ వేతనం ఇస్తామని ఎన్నికల సమయంలో జగన్ చెప్పి అధికారంలోకొచ్చాక మొండి చేయి చూపించారని విమర్శించారు. సమస్యలు పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. ఈ మహాసభలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు వెంకట లక్ష్మి మాట్లాడారు. అనంతరం యూనియన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎస్ఎస్.మూర్తి, అధ్యక్షులుగా మాణిక్యాంబ, కార్యదర్శిగా కె.బేబిరాణి, కోశాధికారిగా భాగ్యలక్ష్మి, ఆఫీస్ బేరర్స్‌గా సుజాత, సుబ్బలక్ష్మి, మార్తమ్మ, సునీత, సూర్యకాంతం, రామలక్ష్మి, అన్నపూర్ణ, కళ్యాణి, నాగజ్యోతి ఎన్నికయ్యారు. అనంతరం వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని, నాణ్యమైన సెల్‌ఫోన్స్ ఇవ్వాలని, రాజకీయ, అధికారుల వేధింపులు ఆపాలని, తొలగించిన అంగన్‌వాడీలను విధుల్లోకి తీసుకోవాలని, ఐసిడిఎస్ నిర్వీర్యం చేసే కుట్రలు ఆపాలని, ఐసిడిఎస్‌కి బడ్జెట్లో నిధులు పెంచాలని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, కార్మిక చట్టాల రద్దును ఉపసంహరించుకోవాలని తీర్మాణాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.సుందర బాబు, కెఎస్‌వి.రామచంద్రరావు, బి.పవన్, టి.సావిత్రి, బి.రాజులోవ, జె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి

యూనియన్ నాయకులతో బేబిరాణి, మూర్తి తదితరులు

మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

విషాదం

- రోడ్డు ప్రమాదంలో నలుగురు కళాకారుల మృతి
- మరో ఏడుగురికి తీవ్రగాయాలు
- కాకినాడ జిల్లా మల్లేపల్లిలో ప్రమాదం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, నల్లజర్ల

వారంతో కళాకారులు. జాతరలు, సంబరాలు, తీర్థల్లో శక్తి వేషాలు వేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కళనే నమ్ముకుని జీవిస్తున్నారు. అందరికీ కళతో ఆనందాన్ని పంచే వారి జీవితాలు విషాదంగా ముగిశాయి. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం శక్తివేషాల కళాకారులు నలుగురు మృతి చెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం, నల్లజర్ల మండలాలు, ఏలూరు జిల్లా ఉంగుటూరుకు చెందిన వారు. అనకాపల్లి జిల్లా కసింకోటలో జరిగే పరమటమ్మ దేవత ఉత్సవాల్లో పాల్గొనేందుకు 13 మంది కళాకారుల బృందం మంగళవారం రాత్రి టాటా మ్యాజిక్ వ్యాన్‌లో బయలు దేరారు. అర్ధరాత్రి కావడంతో అందరూ నిద్రలోకి జారుకున్నారు. వాహనం మల్లేపల్లికి చేరుకునే సరికి ఉన్న ఆగిఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏం జరిగిందో తెలీక కళాకారులు హాహా కారాలు చేశారు. నలిగిపోయిన వ్యాన్‌లోనే తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడారు. స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకుని వారిని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఉంగుటూరు మండలం నారాయణపురంకు చెందిన దుబాకుల ప్రసాద్(47) మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఉండ్రాజవరం మండలం చివటం కు చెందిన గారపాటి మహేష్(20), నల్లజర్ల మండలం నబాపేట కు చెందిన పెనుమాక మంగమ్మ(30) నల్లజర్ల కు చెందిన డ్రైవర్ నల్లకాసుల వెంకట్రావు(30)ను హుటాహుటిన రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వారు ఆసుపత్రిలో మృతి చెందారు. నల్లజర్లకు చెందిన బాజీన రాజు, చేబ్రోలు కైకారంకు చెందిన చింత కింద మహేష్, చిట్టినపాడుకు చెందిన పూర్ణనాగరాజు, దేవదాసు ఆశీర్వాదం, కుమారదేవం కు చెందిన చిడిపి నాగేంద్రబాబు, నర్సంపేటకు చెందిన గణిపాక హారతి, భీమడోలుకు చెందిన ఏసుపోగుల మణికంఠ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో గొల్లపల్లి విష్ణు, ఎం.పండులకు సురక్షింతంగా బయట పడ్డారు. తోటి కళాకారుల మృతితో వారు బోరున రోదిస్తున్నారు. ఉండ్రాజవరం మండలం చివటంకు చెందిన గారపాటి మహేష్(20) తల్లి, సోదరునితో జీవిస్తున్నారు. మూడేళ్ల క్రితం వారి కుటుంబానికి దూరంగా తండ్రి ఉంటున్నాడు. అప్పటి నుంచి కుటుంబ పోషణను మహేష్ చూసుకుంటున్నాడు. శక్తి వేషాలు వేసుకుంటూ కుంటబాన్ని పోషిస్తున్నాడు. మహేష్ మృతితో తల్లి, సోదరుడు బోరున రోదిస్తున్నారు.

ఘటనా స్థలాన్ని పెద్దాపురం డిఎస్‌పి సుంకర మురళీమోహన్, జగ్గంపేట సిఐ సూర్య అప్పారావు, గండేపల్లి ఎస్ఐ గణేష్ కుమార్, కిర్లంపూడి ఎస్ఐ తిరుపతిరావు పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందరి సహకారంతోనే టిబి నిర్మూలన

కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

అందరి సహకారంతోనే టిబిని నివారించగలమని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య, పంచాయతీ రాజ్, తదితర శాఖల అధికారులతో 'ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్'పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టిబిని సమూలంగా నిర్మూలన చేసే దిశలో సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరిని కలుపుకుని వెళ్లాల్సి ఉందన్నారు. లక్ష్య సాధనలో పురోగతిని వేగవంతం చేయడానికి అన్ని కమ్యూనిటీ వాటాదారులను ఏకతాటిపైకి తీసుకురావడం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. టిబి బారిన పడిన వారికి తగిన పౌష్టికాహారం, మందులు అందించే సేవ చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ప్రతి ఒక్కరం సామాజిక బాధ్యతా అలవర్చుకుని, కనీసం ఒక్కరినైనా దత్తత తీసుకుని వారికి కావాల్సిన బలవర్ధకమైన ఆహారం, సప్లిమెంటరీ న్యూట్రీషియన్ మందులు అందించే బాధ్యత చేపట్టాలని కోరారు. టిబి రోగుల సంరక్షణ కోసం ముందుకొచ్చేవారు 'ని-క్షయ్ మిత్ర'లుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. తన వంతుగా ఇద్దరు టీబీ బాధితులను దత్తత తీసుకున్నానని తెలిపారు.

జిల్లా టిబి నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర మాట్లాడుతూ జిల్లాలో సుమారు 850 మంది టిబి బాధితులు ఉన్నారన్నారు. వారిలో 122 మందిని 46 'ని-క్షయ్ మిత్రలుగా బాధ్యత తీసుకున్నారన్నారు. మరింత సమాచారం కోసం 9492297887ను సంప్రదించాలని సూచించారు.

చేయూతను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మహిళలకు ఉపాధి అందించేందుకు అమలు చేస్తున్న చేయూత పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్త, వైఎస్‌ఆర క్రాంతి పథం పీడీ ఎస్.సుభాషిణి అన్నారు. బుధవారం స్త్రీ శక్తి భవనంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొవ్వూరు డివిజన్ పశు సంవర్ధక శాఖ, డిప్యూటీ డైరెక్టర్ రాధాకృష్ణ, కడియం అసిస్టెంట్ డైరెక్టర్ కె.సత్యనారాయణ, డ్వాక్రా మహిళలు, ఐకెపి సిబ్బంది హాజరయ్యారు. పీడీ సుభాషిణి మాట్లాడుతూ చేయూత పథకం లబ్ధిదారులకు పశువుల కొనుగోలు నిమిత్తము బ్యాంక్ లింకేజ్, స్త్రీ నిధి ద్వారా రుణాలు అందించాలన్నారు. ఆర్‌బికెలో వెటర్నరీ అసిస్టెంట్ సహకారంతో గ్రౌండింగ్ చేయించి ఆన్‌లైన్ చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల రుణాల మజూరులో లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. స్త్రీనిధి రుణాలు, ఉన్నతి రుణాలను నూరుశాతం లక్ష్యాలను సాధించేలా పనిచేయాలన్నారు. రుణాలకు సంబంధించి బకాయిలు లేకుండా రికవరీ చేయాలన్నారు.

సమాజాభివృద్ధిలో పత్రికలదే కీలక పాత్ర : ఎంపీ భరత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

సమాజాభివృద్ధిలో పత్రికలు, పాత్రికేయులదే కీలక పాత్ర అని ఎంపి మార్గాని భరత్‌రామ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపారు. 1956లో భారత తొలి ప్రెస్ కమిషన్ సిఫార్స్ మేరకు 1966 నవంబరు 16న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం నవంబరు 16న జాతీయ పత్రికా (నేషనల్ ప్రెస్ డే) దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. ఒక దేశంలో ప్రజాస్వామ్యం సక్రమంగా పనిచేస్తున్నదీ లేనిదీ తెలుసుకోవాలంటే ఆ దేశంలో పత్రికా రంగాన్ని పరిశీలిస్తే చాలన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు పనిచేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. సంచలనాల కోసం కల్పిత వార్తలు రాస్తే విశ్వాసనీయత కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వాస్తవ కథనాలను సరైన ఆధారాలతో ప్రజలకు తెలియజేస్తే పత్రికా విలువలు పెరుగుతాయన్నారు.

మార్గదర్శకాల మేరకే ఓటర్ల జాబితా

జిల్లా ఓటర్ల నమోదు పరిశీలకులు భాస్కర

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం, కొవ్వూరు రూరల్

మార్గదర్శకాల మేరకే ఓటరు జాబితాలను రూపొందిం చాలని తూర్పు గోదావరి జిల్లా ఎలెక్టోరల్ రోల్ అబ్జర్వర్ డాక్టర్ పి.భాస్కర, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో భాస్కర మాట్లాడారు. ఓటరు జాబితాను మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందిస్తున్నారో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. ఎన్నికల ముందు జరిగే ఓటరు నమోదు, జాబితా సవరణ సందర్భాల్లో రాజకీయ పార్టీలు చూపే ఆసక్తి, ప్రతి ఏడాది చేపట్టే ప్రక్రియలో చూపక పోవడం జరుగుతున్న వాస్తవం అన్నారు. రాజకీయ పార్టీలకు పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితా ఇస్తామన్నారు. స్వచ్ఛీకరణతో కూడిన ఓటరు జాబితా ప్రకటనలో రాజకీయ పార్టీల బాధ్యత కీలకం అన్నారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో పేర్లు నమోదుకు డిసెంబర్ 8వరకూ అవకాశం ఉందన్నారు.

కొవ్వూరులో ఓటర్ల జాబితాలపై ఆరా తీస్తున్న పరిశీలకుడు భాస్కర

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఈ మేరకు అవగాహన కల్పించాలన్నారు. 223 ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 1.60లక్షల మంది విద్యార్థులు ఉన్నారని, వీరందరికీ ఓటు హక్కు కోసం చర్యలు చేతీసుకోవాలన్నారు. ఈ మేరకు ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ 2023 జనవరి 1న ప్రచురించే ఓటరు జాబితా అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలో అన్ని నియోజక వర్గాలకు ఎలెక్టోరోల్ రిజిస్ట్రేషన్ అధికారులను నియమించామన్నారు. రాజానగరం నియోజక వర్గానికి పోలవరం ప్రాజెక్టు చెందిన అధికారి నియామకం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో 66.70 శాతం మంది ఓటర్లను ఆధార్‌తో అనుసంధానం చేశామన్నారు. ఈ సమావేశంలో జెసి సిహెచ్.శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, డిఆర్ఒ జి.నరసింహులు, నియోజకవర్గ ఓటరు నమోదు అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఆయన కొవ్వూరు నియోజకవర్గంలో పర్యటించారు. కొవ్వూరు మండలంలోని 76 పోలింగ్ కేంద్రాల స్థాయిలో ఓటరు జాబితా వివరాలను పరిశీలించారు. ఓటరు నమోదు, ఆధార్ అనుసంధానం తదితర అంశాలపై సమగ్ర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, ఇన్‌ఛార్జి తహశీల్దార్, బిఎల్‌ఒలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి తానేటి వనిత

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని పోచవరంలో రెండోరోజైన బుధవరకూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి హాజర్యారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. వారి అమలుతీరుపై ఆరా తీశారు. ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఆరా తీసుకున్నారు. మంత్రి వెంట సర్పంచ్ కాకర్ల హేమలత, వైసిపి మండల అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు దొరబాబు, జడ్‌పి వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, ఎఎంసి చైర్మన్ వి.శ్రీను సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అధిష్టానాన్ని కలిసిన వైసిపి దళిత నేతలు

ప్రజాశక్తి - కడియం

వైసిపి అధిష్టానం పిలుపు మేరకు కడియం మండలం దళిత నేతలు, రాజమహేంద్రవరం రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకష్ణారెడ్డిని బుధవారం కలిశారు. ఈ వివరాలను వైసిపి మండల అధ్యక్షులు స్టాలిన్ విలేకర్లకు వివరించారు. ఇటీవల జరిగిన బుర్రిలంక ఇసుక ర్యాంపు వివాదంపై సజ్జల ఆరా తీశారని తెలిపారు. అక్కడ పరిస్థితిని, పలు అంశాలను వివరించామని స్టాలిన్ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్, నగరం నియోజకవర్గాలకు సంబంధించి దళితులకు నామినేటెడ్ పోస్టుల్లో అన్యాయం జరుగుతుందని తెలిపామన్నారు. దళితులకు న్యాయం జరుగుతుందని, దళితులకు పెద్ద పీట వేస్తామని సజ్జల భరోసా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బడుగు ప్రశాంత్ కుమార్, ఎంపిటిసి సభ్యులు మెల్లిమి గంగరాజు, వారా రాము, పెయ్యల రాజేష్, విప్పర్తి ఫణికుమార్, కాగిత రాజు, బళ్ల అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

పంటకు ధ్రువీకరణ తప్పనిసరి

ప్రజాశక్తి - గోపాలపురం

రైతులు పండించిన పంటకు విశ్వవ్యాప్తంగా మార్కెటింగ్ కల్పించడానికి ధ్రువీకరణ తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు తెలిపారు. గ్రామంలో క్లస్టర్ స్థాయి రైతులకు మంచి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాధవరావు, జిల్లా వనరుల కేంద్రం డిడిఎ బోస్‌బాబు మాట్లాడారు. నూతన మెలకువలను పాటించి, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ సాగుచేఇన పంటలకే ఈ ధ్రువీకరణ పత్రం మంజూరు చేస్తారాన్నరు. ఈ మేరకు భీమోలు, గంగోలు గ్రామాల్లో 250 ఎకరాల్లో వరి పండిస్తున్న రైతులను శిక్షణకు ఎంపిక చేస్తామన్నారు. పురుగుమందుల వినియోగం పెరగడంతో పెట్టుబడి పెరిగిందన్నారు. పంట ఉత్పత్తుల్లో పురుగు మందుల అవశేషాలు ఉండడం వల్ల పర్యావరణం దెబ్బ తినడంతో పాటు మనిషి ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతుందన్నారు. మంచి వ్యవసాయ పద్ధతులు ద్వారా పంట సాగును చేస్తే తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన దిగుబడి సాధిస్తూ నికరదాయాన్ని పెంచుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త నరసింహారావు వరి, మొక్కజొన్నలో పాటించదగిన మంచి వ్యవసాయ పద్ధతులను వివరించారు. రాజానగరం వ్యవసాయ అధికారి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నూతన విధి విధానాలను వివరించారు. ఎఒ రాజారావు మాట్లాడుతూ పంటలు ధ్రువీకరణ ఎలా చేస్తారో వివరించారు. ఈ కార్యక్రమంలో భీమోలు గ్రామ రైతులు, వ్యవసాయ,ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన ఎంఎల్ఎ తలారి

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలోని సంగాయగూడెంలో ఎంపిపి పాఠశాలను ఎంఎల్ఎ తలారి వెంకట్రావు బుధవారం పరిశీలించారు. గ్రామంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. వాటి అమలుపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఎంపిపి పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అందిస్తున్న సేవలపై ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నర్సరీల మొక్కలకు ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి - కడియం

ట్రీస్ అవుట్ సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా ప్రోగ్రామ్‌లో కడియం నర్సరీల్లోని మొక్కలకు ప్రాధాన్యత కల్పించాలని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కోరింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ శాఖ, వరల్డ్ ఆగ్రో ఫారెస్ట్ న్యూ ఢిల్లీ, యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో విజయవాడలో హోటల్ మినర్వా గ్రాండ్‌లో ప్రారంభించిన ట్రీస్ అవుట్ సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా అనే కార్యక్రమంలో నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా విచ్చేసిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అధ్యక్షులు పుల్లా సత్యనారాయణతో పాటుగా పాలకవర్గ సభ్యులు మొక్కను ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడారు. కడియం మండల పరిధిలోని 11 గ్రామాల్లో నర్సరీలు ఉన్నాయన్నారు. దేశ విదేశాలకు సైతం పలు రకాల మొక్కలను అన్ని రకాల సైజులలో తయారు చేసి ఎగుమతి చేస్తున్నామన్నారు. ట్రీస్ అవుట్ సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా ప్రోగ్రామ్ లో కడియం నర్సరీలకు ప్రాధాన్యత కల్పించాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బొర్సు సుబ్బారాయుడు, పాటంశెట్టి శేషుకుమార్, చెక్కపల్లి పోలరాజు, సింగంశెట్టి శ్రీనివాస్, సుంకర గోవిందు, మెర్ల కృష్ణ , తదితరుల పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న కడియం నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులు

కార్టూ'నిజం'



మూఢ నమ్మకాల నిర్మూలనా చట్టంతేవడానికి ముహూర్తం కుదరడం లేదంటయ్యా మరి..!!

ప్రజారోగ్యం కోసమే ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - గోపాలపురం, దేవరపల్లి, ఉండ్రాజవరం

జిల్లాలో పలుచోట్ల ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాలను నిర్వహించారు. దేవరపల్లి మండలం గౌరీపట్నం పంచాయతీ వద్ద ఫ్యామిలీ ఫిజీషన్‌లో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాయి అన్నపూర్ణ మాట్లాడారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. వైద్యులు పి.మౌనిక, స్వర్ణలత మాట్లాడారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద ఉన్న రోగులను, ఇంటి వద్దకు వెళ్లి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రతి నెల పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యనారాయణ, శాంతి శ్రీ, సుబ్బలక్ష్మి, సి హెచ్ ఓ నాగేంద్రుడు కార్యదర్శి ఈ సత్యనారాయణ ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి ఆర్.ఉషాదేవి , 104 వాహన డాక్టర్ వెంకటేశ్వర్లు 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

గోపాలపురం మండలం సగ్గొండలో ఫ్యామిలీ ఫిజీషియన్‌లో పాల్గొన్న సర్పంచ్ తదితరులు

ఈ కార్యక్రమంలో సచివాలయ ఎంఎల్‌హెచ్‌పి కె.రోజా, ఎఎన్ఎం సిహెచ్. జ్ఞానేశ్వరి, సూపర్‌వైజర్లు జి.వెంకటరాజు, కె.కె.సుభాషిణి, ఆశాలు పాల్గొన్నారు.

గోపాలపురం : రాష్ట్ర ప్రభుత్వం ఎంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని సగ్గొండ సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని గోపవరం సచివాలయం వద్ద వైద్య శిబిరాన్ని వైద్యులు శ్రీనివాసరావు, ఎ.డేవిడ్‌రాజులతో కలిసి సర్పంచ్ శేఖర్‌బాబు, ఆయన సతీమణి కవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా జీవించేందుకు ఈ వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు, ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయించుకున్నవ వారికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనురాధ, ఉపసర్పంచ్ గుడ్ల ధనలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు ఎం.రామచంద్రం, యండపల్లి సుజాత, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలు ఎంపిపి సత్తిబాబు, ఎంపిడిఓ

అవార్డులతో మరింత బాధ్యత

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

అవార్డులు రావడం వల్ల మరింత బాధ్యతను పెంచుతుందని సామర్లకోట ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఓ డి.శ్రీలలితలు పేర్కొన్నారు. విశాఖపట్నంకు చెందిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సేవారత్న పురస్కారానికి ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఓ డి.శ్రీలలితలను ఎంపిక చేశారు. ఇటీవల విశాఖపట్నంలో వారిని అవార్డులతో సత్కరించారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న శేషబాబ్జి

సిఐటియు పెద్దాపురం మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పిఠాపురం

స్థానిక బైపాస్ రోడ్డులోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో సిఐటియు మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. కరణం విశ్వనాథం అధ్యక్షత తొలుత సంతాప తీర్మానాన్ని ఎల్ఐసి ఏజెంట్ల సంఘం నాయకులు కెవి.సత్యనారాయణ ప్రవేశపెట్టి నివాళులర్పించారు. అనంతరం కుంచే విన్న కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. మహాసభలో పాల్గొన్న సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.శేషబాబ్జీ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వారికి అప్పనంగా కట్టబెడుతూ మరోపక్క నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అధికార వైసిపి, టిడిపి ఎంపిలు నోరు మెదపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు జి.అప్పారెడ్డి, కెవివి.సత్యనారాయణ, ఎన్.సూర్యనారాయణ, కోటేటి రాజు, డి.వర్మ, సత్యవతి, సందీప్రరావు, ఎన్.ఏసుబు, సిహెచ్.రమణ సూర్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం పిఠాపురం మండల సిఐటియు నూతన కమిటీని ఎన్నుకున్నారు.

చిన్నారుల నుంచే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-సామర్లకోట

ముద్దేళ్ల వయసున్న చిన్నారి మొదలు వృద్ధుల వరకు జగనన్న సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రజలకు అందిస్తున్నారని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సామర్లకోట మున్సిపాలిటీలోని రెండు, మూడు వార్డుల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని హౌసింగ్ చైర్మన్ దొరబాబు బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల అందరి హృదయాల్లో ఎంతో ఆదరాభిమానాలు సంపాదించుకున్నారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్, కౌన్సిలర్లు పసిలి కుసుమ చంటిబాబు, మర్రి శేషారావు, పిల్లా సత్యనారాయణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సల్లూరి కళ్యాణ్ పాల్గొన్నారు.

తక్షణం ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-కాజులూరు

రైతులు పండించిన ధాన్యాన్ని తక్షణ మే ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఏపి కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తణుకువాడ, గొల్లపాలెం, ఆర్యవటం, తర్లంపూడి తిప్పరాజుపాలెం, కాజులూరులో ధాన్యం కొనుగోలు చేసిన రైతులతో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ కోతలు పూర్తి మొదలుపెట్టి 15 రోజులు కావస్తోందన్నారు. ప్రతి గ్రామంలో ధాన్యం రాశులు ఉన్నా నేటికీ కొనుగోలు చేయకపోవడంతో పండించిన రైతు ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని రైతులు అంటున్నారన్నారు. వర్షం కాని వస్తే రైతు ధాన్యమంతా తడిసిపోతుందని వెంటనే కొనుగోలు చేయాలని చెప్పి రైతులు వాపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు గోవింద్, దంగేటి వినుతప్రావు, నొక్కు శ్రీనివాస్, పోతుల వెంకటరమణ, బత్తుల బుల్లయ్య, వాసంశెట్టి సత్యనారాయణ, కుదుపూడి భూచక్రం, నామా చంద్రరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న మానవత

మహిళకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళ్ళపూడి

మలకపల్లికి చెందిన బాణాల రమణమ్మ(75)కు మానవతా సంస్థ బుధవారం రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించింది. సంస్థ మండల అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడారు. అన్నార్తులను, ఒంటరి మహిళలను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నాయని. ఒంటరిగా ఉండడమే కాకుండా పక్షవాతంతో కాలి ఆపరేషన్ చేయించుకున్న రమణమ్మకు ఈ మేరకు ఆర్థిక సాయం అందించామన్నారు. సంస్థ రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య మూడో రూ.500 సాయాన్ని అందించారన్నారు. కార్యక్రమంలో ఎస్.సుబ్బారావు, సిహెచ్. అంజనేయులు, ఎన్.రాజశేఖర్, అప్పన చంద్రధరగుప్త తదితరులు పాల్గొన్నారు.

సమావేశ:ంలో మాట్లాడుతున్న అనంతలక్ష్మి

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -మండపేట

విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని విలేజ్, వార్డ్ సెకటేరియట్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ బి. అనంతలక్ష్మి అన్నారు. బుధవారం రాయవరంలోని రామయ్య జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె పరిశీలించారు. భోజన పథకం నాణ్యత, రుచిని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా ప్రోత్సహకాలు, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి పథకం తదితరు పథకాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పప్పు శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99189

'బాబుతోనే గిరిజన ప్రాంతాల అభివృద్ధి'

ప్రజాశక్తి -రౌతులపూడి

గిరిజన ప్రాంతాల అభివృద్ధి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమైందని టిడిపి పరిశీలకుడు బండారు సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంఎల్సి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ప్రత్తిపాడు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల రాజా ఆధ్వర్యంలో బుధవారం జాల్దాం గ్రామంలో నిర్వహించిన గిరిజన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు విద్యా వైద్యం, తాగునీరు రహదారి నిర్మాణ పనులు వంటి అనేక సంక్షేమ పథకాలు అందించినట్టు చెప్పారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం గిరిజన అటవీ ప్రాంతాల్లో ఉన్న గనులను దోచుకోవడంలో ఉన్న శ్రద్ధ గిరిజనుల అభివృద్ధిలో మాత్రం పాటుపడలేదన్నారు. ప్రతిపాడు నియోజకవర్గంలో 56 గిరిజన గ్రామాలను షెడ్యూల్ ప్రాంతంలో విలీనం చేయకుండా విలీనానికి వ్యతిరేకంగా స్థానిక అధికార పార్టీ నేతలు తీర్మానాలు చేయించారని ఆరోపించారు. అనంతరం

సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

ముగ్గురు వార్డు మెంబర్లతో కలిసి 100 కార్యకర్తలు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కాకినాడ పార్లమెంట్ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, తెలుగు యువత అధ్యక్షులు యనమల శివరామకృష్ణ, పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ ఎంపిపిలు బద్ది మణిరామారావు, భాస్కర్ బాబు, కొమ్ముల కన్నబాబు, సత్యనారాయణ, పైలా సాంబశివరావు, ఎస్.మౌళి ఉన్నారు.

గ్రంథాలయాల ద్వారా విజ్ఞాన సముపార్జన

ప్రజాశక్తి-కాకినాడ

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మూడోరోజు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం గ్రంథాలయ ఉద్యమకారులను స్మరిస్తూ ఎంతోమంది త్యాగమూర్తులు ఫలితంగా ఈ గ్రంథాలయాలు ఏర్పాటు కాబడ్డాయని, విద్యార్థులంతా గ్రంథాలయాలను ఉపయోగించు కోవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆమె హితవు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న మదిలో మరో కలికితురాయి డిజిటల్ గ్రంథాలయాల ఆవిర్భావం అని, నేడు సాంకేతికత అభివృద్ధి చెందుతున్న తరుణంలో గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ముఖ్య అతిథిగా ఎపి డబ్ల్యుఐడిసి ఇఇ వి.లక్ష్మణ రెడ్డి మాట్లాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాగిరెడ్డి చంద్రకళ

ఐడియల్ డిగ్రీ కళాశాల చీఫ్ లైబ్రరియన్ చింతపల్లి సుబ్బారావు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి విఎల్ఎన్ఎస్‌వి.ప్రసాద్, ఉప గ్రంథాలయాధికారి ఆర్.వెంకటరాము, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తుమ్మలపల్లి జయకృష్ణ పాల్గొన్నారు.

పలువురికి దొరబాబు పరామర్శ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలో పలు కుటుంబాలను హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు బుదవారం పరామర్శించారు. ఉండూరులో బత్సల సూర్యనారాయణ కుమారుడు బత్సల సుబ్బారావు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని, ఇటీవల మృతి చెందిన నక్కా త్రిమూర్తులు కుటుంబాన్ని, చంద్రంపాలెంలో వైసిపి వికలాంగుల అధ్యక్షులు దేశిరెడ్డి గణపతి సోదరుడు దేశిరెడ్డి శ్రీను ఇటీవలే మృతి చెందగా

నివాళి అర్పిస్తున్న దొరబాబు

వారి కుటుంబ సభ్యులను, చంద్రంపాలెంలో ఇటీవలే ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న సన్నీబోయిన నూకరాజు కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, కో ఆప్షన్ సభ్యులు మండపాక సురేష్, సర్పంచ్ సీమల భవాని, నాగబోయిన రాజబాబు, సిద్ది సత్తిబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తంగెళ్ల రాధాకష్ణ, ఇజ్జిన తేజ, గుబ్బల అప్పన్న, సర్పంచ్ సీమల భవాని, నర్ల కొండలరావు, సత్యంశెట్టి సాయిబాబు, నందిపాటి వీరబాబు, సర్పంచి సత్యడి ధనలక్ష్మి సత్యనారాయణ, ఉప సర్పంచ్ కొప్పరెడ్డి రాధాకృష్ణ, పల్లా రాజాబాబు, సంకా కామేశ్వర గుప్త, పాలచర్ల సాయిబాబు, మాకిరెడ్డి రాంబాబు, నిడదవోలు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-కాజులూరు

రెండున్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యమని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు యం.విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం కరప ఎడిఎ బాబూరావుతో కలిసి మండలంలోని శీల, కాజులూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అశోక్, సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు రామకృష్ణ, సర్పంచ్ కోమలి

ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వెంకటరమణ, ఎఎంసి చైర్మెన్ నల్లమిల్లి రామారెడ్డి, దంగేటి వెంకట సుబ్బారావు, గరగ కొండలరావు పాల్గొన్నారు.

ఉపాధి పనుల గుర్తింపునకు ఆదేశం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో నూతన ఉపాధి పనులను గుర్తించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త పనులను గుర్తించి అంచనాలను తయారు చేయాలన్నారు. జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు 90 రోజుల పది దినాలకు పేమెంట్స్ అందేలా చూడాలన్నారు. రోజుకి 1,300 మ్యాండిట్స్ టార్గెట్‌గా ఇచ్చారు. ఉపాధి హామీ వర్కర్లకు ట్యాగ్‌తో కూడిన ఐడెంటి కార్డ్స్ విడతల వారీగా అన్ని గ్రూపులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిఎ.శ్రీనివాస్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్

సమావేశంలో పాల్గొన్న ఎంఎల్ఎ గోరంట్ల, బిసి నాయకులు

'బడుగు బలహీన వర్గాలకు అండగా టిడిపి'

ప్రజాశక్తి - కడియం

బడుగు, బలహీన వర్గాలకు టిడిపి అండగా ఉంటుందని ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు వేమగిరిలో రాష్ట్ర శెట్టిబలిజ కన్వీనర్ కుడిపూడి సత్తిబాబు అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన టిడిపి శెట్టిబలిజ సాధికార సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలను అణిచివేసే దిశగా ముఖ్యమంత్రి పాలన సాగుతుందన్నారు. పేదలకు, వెనుకబడిన వర్గాలకు అనేక పథకాలు ఇస్తున్నామని చెప్పుకోవడం తప్ప అవి ఎంతమంది వర్తిస్తున్నాయని ప్రశ్నించారు. బిసి నాయకులపై జగన్ నిర్లక్ష్య వైఖరి చూపిస్తున్నారన్నారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి బిసిలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, రాష్ట్ర శెట్టిబలిజ సాధికార కన్వీనర్ మునస అప్పారావు, పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పితాని శివరామకృష్ణ, జోగు చక్రవర్తి, గుత్తుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

6వ వార్డులో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-మండపేట

స్థానిక పురపాలక సంఘం పరిధిలోని 6వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్సి తోట త్రిమూర్తులు మాట్లాడుతూ సిఎం జగన్ తన సుదీర్ఘ పాదయాత్రలో పేదల కష్టాలు తెలుసుకొన్నారుని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు సిఎం జగన్ ప్రవేశ పెట్టారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా అన్ని పథకాలను ప్రతీ ఇంటికీ చేరవేస్తున్న ఏకైక ప్రభుత్వం

వార్డు ప్రజలతో మాట్లాడుతున్న తోట

తమదేనన్నారు. అభివృద్ధి సంక్షేమమే పార్టీని అధికారంలోకి తీసుకొస్తాయని ఎంఎల్సి తోట ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ప్రజా సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకష్ణ, సాధనాల శివ భగవాన్, యరమాటి వెంకన్న బాబు, తదితరులు పాల్గొన్నారు.

19న 'ధనలక్ష్మి' ముఖశిఖరం ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంకలో ధనలక్ష్మి అమ్మవారి ఆలయ ముఖ శిఖరం ఈనెల 19న ఆలయ అర్చకులు మున్నంగి ప్రభాకర శర్మ నేతృత్వంలో ఆవిష్కరిస్తారని, అమ్మవారుల విగ్రహాలు ప్రతిష్టాపన చేస్తున్నామని వైసిపి మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డితో పాటుగా నియోజకవర్గ ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు. ఇందులో భాగంగా అన్న సమారాధన కార్యక్రమంతో పాటుగా వివిధ ప్రదేశాల నుంచి వచ్చే యాత్రికుల తాకిడికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట వైసిపినేతలు దొండపాటి వెంకటేశ్వరరావు(బులిరెడ్డి), అడబాల వీర్రాజు, దొండపాటి చంటి, దొండపాటి శ్రీను, మోటూరి సురేష్, దొండపాటి వెంకట్రామయ్య, బి.వీర వెంకట్రావు, తమ్మన హరి, రాయుడు వెంకటేష్, బొర్రా వీరబాబు తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

విలేకరులతో అనుబంధం మరువలేనిది : కలెక్టర్

ప్రజాశక్తి-కాకినాడ

నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు చెందిన విలేకరులతో తనకున్న అనుబంధం మరువలేనిదని, విలేకరులకు విద్య, ఆరోగ్య పరంగా అన్ని విధాల తన వంతు సహాయం నిరంతరం ఉంటుందని కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అన్నారు. విలేకరులతో పాటు వారి కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం పరంగా తనకు తెలియజేస్తే విధానపరంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని కలెక్టర్ విలేకరులకు భరోసా కల్పించారు. బుధవారం కాకినాడ ఆర్అండ్బి అతిథి గృహంలో కాకినాడ చిన్న మధ్య తరహా దినపత్రికల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమారాధన, జాతీయ పత్రికా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులుగా వారణాసి సూర్యనారాయణ, డాక్టర్ వైవి పరశురాం, అడపా అప్పారావులను ఘనంగా సత్కరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

మార్చిలో టిడ్కో గృహాల అప్పగింతకు చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వచ్చే ఏడాది మార్చి నాటికల్లా టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకొంటున్నామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం టిడ్కో ఇళ్లు నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల పథకంపై ప్రత్యేకాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం కాకినాడలో 2056 టిడ్కో ఇళ్లకు సంబంధించి ఇప్పటికే 1500 మంది లబ్ధిదారులకు రుణాల మంజూరు ప్రక్రియ పూర్తయిందన్నారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా వేగవంతంగా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని టిడ్కో అధికారులను ఆదేశించారు. టిడ్కో ఇళ్ల వద్ద రోడ్లు, డ్రెయిన్‌లు, విద్యుత్, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలను వేగవంతం చేయాలని కమిషనర్ కోరారు. ఇవన్నీ పూర్తిచేసి మార్చికల్లా లబ్ధిదారులకు ఇళ్ల అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా పునాదుల స్థాయిలో ప్రతి లబ్ధిదారునికీ రూ.35 వేలు చొప్పున స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక తోడ్పాటు ఇచ్చేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డిఇ గుప్తా, టిపిఆర్ఒ మానే కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం, దూబచర్ల వద్ద, 16వ నెంబరు జాతీయ రహదారిపై. బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు నల్లజర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరవాసరం మండలంలో కలపూడి గ్రామారికి చెందిన గంధం దుర్గా వెంకటస్వామి నాయుడు (24) ఐసర్ వ్యాన్ లారీలో విశాఖపట్నం నుంచి విజయవాడకు కొబ్బరి బొండాలు వేసుకు వెళుతున్నాడు. అయితే నల్లజర్ల మండలం దూబచర్ల వద ఆగి ఉన్న లారీని వెనుక నుండి ఢీకొట్టడంతో దుర్గ వెంకటస్వామి నాయుడుకు తీవ్ర గాయాలు అయ్యాయి. అతనిని వెంటనే 108 లో ఏలూరు తరలించగా అక్కడినుంచి మెరుగైన చికిత్స కొరకు విజయవాడ మణిపాల్ ఆసుపత్రికి తరలించగా బుధవారం మధ్యాహ్నం ప్రాంతంలో మృతి చెందాడని నల్లజర్ల ఎస్ఐ అయ్యప్ప రెడ్డి తెలిపారు.

IN THE COURT OF THE V ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: KAKINADA
O.S. NO. 147 of 2022
Between:
KAKARAPALLI SRINIVAS ...Plaintiff
and
1) PAKA HARSHIL
2) PAKA JASIMITHA ...Defendants
To :
1) Paka Harshil, S/o. Paka Dora Babu (Late) Flat No. 101, Padmavathi Residency, Opp. Akhil Junior College, Near Mother Teresa Statue, Santhinagar, Kakinada - 533 003. East Godavari District, A.P.
2) Paka Jasimitha, D/o. Paka Dora Babu (Late) Flat No. 101, Padmavathi Residency, Opp. Akhil Junior College, Near Mother Teresa Statue, Santhinagar, Kakinada - 533 003. East Godavari District, A.P.
పై నెంబరు దావా గ్రంథం నందు ప్రతివాదులు అయిన మీకు ఎన్నిసార్లు శ్రీ కోర్టువారు నుండి సమన్లు పంపించినను పుచ్చుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున సదరు ప్రతివాదులు అయిన మీరు **ది. 25-11-2022వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** పైన ఉదహరించిన శ్రీ కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరు అయ్యి మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న శ్రీ కోర్టువారికి తెలియపరుచుకొనవలెను. లేని ఎడల శ్రీ కోర్టువారు మీ పరోక్షమునందు విచారించి తీర్మానము చేయుదురు అని యిందుమూలముగా తెలియజేయడమైనది.
పలివెల వెంకటేశ్వరరావు, B.Com., B.L., అడ్వకేట్, డో.నెం. 1-12-5, మిలిటరీ రోడ్, భానుగుడి జంక్షన్ దగ్గర, కాకినాడ.
కాకినాడ. ది.16-11-2022 సెల్: 98488 48152

నేరాలు ఘోరాలు

బడ్డీ కొట్టు యజమానిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు చెరువు గట్టు సెంటర్లో నెలకొన్న బడ్డీ కొట్టు వివాదంలో కొట్టు యజమాని చిట్టూరి సత్యనారాయణ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడంతో పంచాయతీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాళ్లరేవు పంచాయతీ కార్య దర్శి శంకర నారాయణ మాట్లాడుతూ చెరువుగట్టు సెంటర్లో కోర్టు పరిధిలో ఉన్న స్థలంలో బడ్డీ కొట్టు తొలగించాలని యజమాని సత్యనారాయణకు నోటీసు ఇవ్వడానికి వెళ్లగా అతను తిరస్కరించాడన్నారు. ఆ నోటీసును బడ్డీ కొట్టుకు అతికించినట్లు తెలిపారు. కొట్టు తొలగిస్తే ఆత్మహత్య చేసుకుంటానని, పురుగుల మందు డబ్బాతో చిట్టూరి సత్యనారాయణ ఆత్మహత్యకు ప్రయత్నించడంతో అతనిని వారించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంపిడిఒ ద్వారా ఫిర్యాదు అందజేయాలని పోలీసులు తెలపడంతో మండల అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినట్లు కార్యదర్శి అన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో డ్రైవర్‌కు ఏడాది జైలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

రోడ్డు ప్రమాదంలో కేసులో ఒక వ్యక్తి మృతికి కారణమైన ఆర్‌టిసి బస్సు డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ బుధవారం కాకినాడ స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. సామర్లకోట సిఐ దుర్గా ప్రసాద్ ఇచ్చిన సమాచారం ప్రకారం 2019 డిసెంబర్ 15న సామర్లకోట శివారు షుగర్ ఫ్యాక్టరీ వద్ద బస్ డ్రైవర్ మోటార్ సైకిల్ ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో హుస్సేన్ పురం గ్రామస్తుడైన కోట చంట చనిపోయాడు. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ సుమంత్ బస్ డ్రైవర్ వళ్ళ నానయ్యను అరెస్ట్ చేసి దర్యాప్తు చేశారు. నిందితునిపై నేరం రుజువు కావడంతో బుధవారం కాకినాడ స్పెషల్ మొబైల్ జిఎఫ్‌సిఎం కోర్టు మెజిస్ట్రేట్ జానకి నిందితునికి ఒక ఏడాది జైలు, రూ. వెయ్యి జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున ఎపిపి విజయ వాదించారు.

నాలుగు టన్నుల ఐరన్ ఇప్పించాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

నాడు-నేడు పనులకు సంబంధించి ఆరు టన్నుల ఐరన్ ఇస్తానని అడ్వాన్స్ సొమ్ము తీసుకుని కేవలం రెండు టన్నులే ఇచ్చారని, మిగిలిన నాలుగు టన్నులు వ్యాపారి నుంచి ఇప్పించాలని పెదబ్రహ్మదేవం జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం జి.మల్లేశ్వరరావు బుధవారం సామర్లకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివి.. తమ పాఠశాల్లో నాడు-నేడు ఫేజులో పాఠశాల అదనపు గదుల నిర్మాణంలో భాగంగా విద్యా కమిటీలో తీర్మానం చేసి సామర్లకోటకు చెందిన బాలా త్రిపుర సుందరీ ట్రేడర్స్‌కు రూ.4,55,789 నెప్ట పద్ధతిలో అకౌంట్‌కు జమచేశానని హెచ్ఎం తెలిపారు. రెండు విడతలుగా రెండు టన్నులు ఇచ్చారని, మిగిలిన నాలుగు టన్నులు వాసిరెడ్డి ప్రసాద్‌తో స్కూల్‌కు పంపానని చెప్పాడని, అయితే నేటికీ తమకు అందలేదన్నారు. దీనిపై హెచ్ఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వరుస చోరీలతో ఆందోళన

ప్రజాశక్తి -చాగల్లు

చాగల్లులో వరుస దోపిడీలతో గ్రామస్థులు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామంలో వరుసగా గుర్తుతెలియని వ్యక్తులు దాడులు చేసి సెల్ ఫోన్స్, మేకలు, కోళ్ల దోపిడీకి పాల్పడుతున్నారు. మంగళవారం అర్ధరాత్రి చాగలు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వినాయక స్వామి, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్ల ఆలయ హుండీలను దుండగులు ఎత్తుకెళ్లారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు మాస్క్ ధరించి చోరీకి పాల్పడినట్లు సిసి కెమెరాలలో నమోదైనట్లు తెలుస్తుంది. ఈఘటనపై ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు చాగల్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

పడిపోయినవి
పెద్దాపురం మండలం, వడ్లమూరు గ్రామానికి చెందిన దేవళ్ళ హిమబిందు, భర్త: సత్య పవన్‌కుమార్ తెలియజేయునది ఏమనగా, నా తల్లి గారు మట్లపర్తి జానకిరాణి పేరున తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరువు మండలం, చిట్కూల్ గ్రామం నందు 300 చదరపు గజాలు ఇంటి స్థలం కలదు. దీనికి సంబంధించి **దస్తావేజు నెంబరు 4260/1987** ను తీసుకుని ది. 02-11-2022న వడ్లమూరు నుండి పెద్దాపురం మెయిన్‌రోడ్‌లోని జిరాక్స్ సెంటర్‌కు వెడుతుండగా పడిపోయినవి. దొరికినవారు ఈక్రింది అడ్రసుకు అందజేయవలసిందిగా కోరుతున్నాను.
ఇట్లు: **దేవళ్ళ హిమబిందు**
మట్లపర్తివారి వీధి, వడ్లమూరు
పెద్దాపురం మండలం, సెల్: 6305716079

ప్రకటన
పెద్దాపురం కాపురస్తులు హిందువులు **యెంద్రు గోవిందరావు గారి కుమారుడు యెంద్రు వీర వెంకట అయ్యప్పచౌదరి** ఇచ్చిన ప్రకటన.
నేను పెద్దాపురం కాపురస్తుడను. నేను ది. 14-11-2022వ తేదీన నా తాలూకు అనగా నా తల్లిగారైన యెంద్రు లేటు విజయలక్ష్మి గారి పేర్న గల రిజిస్టర్డ్ సేల్ డీడ్ ది. 7-7-2011 వైడ్.నెం. 2456/2011 గా గల ఒరిజినల్ దస్తావేజును కాపీ తీయించు నిమిత్తం పెద్దాపురం విక్టరీ బజార్ వద్ద పోగొట్టుకొని ఉన్నాను. సదరు నా తల్లి గారి పేర ఒరిజినల్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ ది. 7-7-2011 వైడ్.నెం. 2456/2011 ఎవరికైనా దొరికిన యెడల నాకు తిరిగి ఇవ్వవలసినదిగా కోరుచున్నాను. తగిన పారితోషికం ఇవ్వబడును. సదరు దస్తావేజుతో ఎటువంటి క్రయ విక్రయాదులు చేసిన చెల్లవు. నేను తీసుకొను చర్యలకు బాధ్యులు కాగలరని ఇందుమూలముగా తెలియచేయడమైనది.
YENDRU VEERA VENKATA AYYAPPA CHOWDARY
S/o. Govindarao, D.No.2-12-4/b,
Ramaraopeta, Peddapuram, Cell: 9666176999